# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకి పోతనకి అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది – వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన

రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

మరి మొదలెడదామా?

పోతన భాగవతం ఎత్తుకుంటూ రాసిన మొదటి పద్యం చూడండి.

**శా. శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర**

**క్షైకారంభకు భక్త పాలన కళా సంరంభకున్ దానవో**

**ద్రేకస్తంభకుఁ గేళి లోల విలసద్దృగ్జాల సంభూత నా**

**నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనాడింభకున్.** [1-1]

దీనికి జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి వ్యాఖ్యానం "మొత్తం భాగవతం అంతా ఉటంకించి ఆరు దళాల్లో ఈ పద్యం రాసేడు పోతన. మొత్తం భాగవతానికే కాదు తెలుగు సాహిత్యానికంతటికీ మకుటాయమానమైన పద్యం ఇది. ఇటువంటి పద్యం తెలుగు సాహిత్యంలో “నభూతో నభవిష్యతి."

పరీక్షిత్తుకి వారంలోపుల చావు రాసిపెట్టి ఉంది. తక్షకుడు వచ్చి కాటు వేయడానికి అన్ని సిద్ధం ఐపోయాయి. శాపం ప్రకారం హరిహరాదులు అడ్డమొచ్చినా చావు తప్పదు. అప్పుడు శుకయోగి వచ్చి భాగవతం చెప్పడం మొదలుపెట్టేడు రాజుకి. ఎందుకు? అదే చెప్తున్నాడు మొదటి దళంలో. " శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్.." పుట్టకముందే చచ్చిపోయిన శిశువుని, కాలితో తాకి బతికించేడు కృష్ణుడు. అటువంటివాడు రాజు అయ్యీ శాపానికి గురయ్యాడు ఇప్పుడు. ఇంక వారం రోజుల్లో చేయగలిగిన మంచి పని ఏదైనా ఉంటే ఇది మొదటిది - తను అమ్మ కడుపులో ఉండగానే ప్రాణం పోసిన విష్ణువుని జేరుకోవడం - అంటే శ్రీ కైవల్యపదం జేరడం - ఎలా అనే ఆలోచించుకోవడం.

రెండో దళం: ఆ శ్రీపతి ఎటువంటివాడు? లోక రక్షైకా రంభకుడు. లోకాన్ని రక్షించడానికి వెనుకాడేది లేదు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులనించీ, రావణ కుంభకర్ణులనించీ, అలా ఎవర్నుంచైనా సరే. ఇంక మూడో దళంలో భక్తపాలన కళాసంరంభకున్ అన్నాడు.

అంటే కుచేలుడైనా, అర్జునుడైనా, ప్రహ్లాదుడైనా, ఆఖరికి కుబ్జ అయినా సరే ఎప్పుడు భక్తుల్ని ఎలా రక్షిద్దామా అని చూస్తూ కాసుకుని కూర్చుంటాడుట. నాలుగో దళంలో దానవోద్రేక స్థంభకున్ అన్నాడు. ముందు మన్వంతరంలో కాబోయే బలి ఇప్పుడే నూరు అశ్వమేధాలు చేసేసి ఇంద్రపదవి కాంక్షించేడు. అలాగ ఎలా కుదురుతుంది? ఉన్న ఇంద్రుడి పదవీ కాలం అవ్వాలి కదా? అందువల్ల బలి ఉద్రేకాన్ని స్థంభించడానికి ఆయన వామనమూర్తి అయ్యాడు. దీనిగురించి మళ్ళీ వామనవతారంలో విపులంగా చూద్దాం.

ముందు దానవుల్నందర్నీ చంపేస్తే పోలే? అలా కుదరదు ఎందుకంటే భగవంతుడెప్పుడూ ఎలా భక్తుల్ని రక్షిద్దామా అనే చూస్తూ ఉంటాడుట. ఎలా చంపుదామా అని కాదు. అదీగాక హిరణ్యాక్ష హిరణ్యకశిపులు మన అందరికన్నా ముందు, ఆయన భక్తులు/సేవకులు. భగవంతుడికి ఆ లెక్కన అందరూ భక్తులే. ఈ పద్యాన్నికొంచెం వ్యాకరణం సర్దేసి దానవోద్రేక స్థంభకున్, లోకరక్షైకా రంభకున్ అని తిరగరాయొచ్చు కావలిస్తే. పోతన అంతకంటే బాగా - బాగా ఏమిటిలెండి, బ్రహ్మాండంగా - రాయగలడు కూడా. అయినా ఇలాగే రాసేడు ఎందుకంటే భగతంతుడి పని ముందు లోకాల్ని రక్షించడం, ఆ తర్వాతే దానవోద్రేక స్థంభకుడు ఆయన. రామాయణంలో రాముడు కూడా అదే చెప్తాడు చాలా సార్లు సుగ్రీవ, హనుమంతుల్తో: ఆఖరికి రావణుడు వచ్చి శరణు వేడినా సరే నేను క్షమిస్తాను అని. కాని వాడు రావొద్దూ?

ఐదో దళంలో ఈ బ్రహ్మాండాలన్నీ ఆయన కనుసన్నల్లో ఆటపాటల్లో పుట్టి, ఆయనలోనే ఉన్నాయి అంటున్నాడు. అంటే ఈ విశ్వం అంతా ఆయన కనుసన్నల్లో ఉంది. అటువంటివాడు ఆరోదళంలో చెప్పబడుతున్నాడు. 'మహానందాంగనా డింభకున్' అనేదాంట్లో లీలా మానుష విగ్రహుడి మొత్తం కృష్ణావతారం ధ్వనిస్తోంది.

ఈ పద్యం ఎంత సులభంగా ఉందో చెప్పాలంటే రెండుమూడు సార్లు చదివితే చాలు గుర్తుండిపోతుంది.
పరీక్షిత్తు మాట అటుంచి ఒకసారి మళ్ళీ పద్యం చదువుదాం. భాగవతం ఎందుకు చదవడం మొదలు పెట్టేం? భక్తితోటి కావొచ్చు, భాషమీద అభిమానంతో కావొచ్చు. మనం భక్తితో చదవడం మొదలు పెడితే మొదట చింతించవల్సింది మొదటి దళంలో ఉంది. ఆ చింతించే ఆలోచన వచ్చాక ఎవరిగురించి చింతించాలనేది మిగతా ఐదు దళాల్లో ఉంది. అబ్బే కాదూ, నాకు భాష మీదే అభిమానం అంటారా? అయితే మీకు కావాల్సిన పద్యం ఇంతకంటే మంచిది ఎక్కడైనా దొరుకుతుందా? అదీ, మొట్టమొదటి పద్యంగా? అందుకే ఎటునుంచి ఎటు చూసినా ఇది తెలుగు సాహిత్యానికీ, భాగవతానికీ మకుటాయమానమైన పద్యం. చూశారా మొదట్లోనే భాగవతం ఎంత గొప్పగా మొదలు పెట్టాడో?

ఇంక రెండో పద్యం చూద్దాం.

**ఉ. వాలిన భక్తి మ్రొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయా**

**శాలికి శూలికిన్ శిఖరిజా ముఖ పద్మ మయూఖ మాలికిన్**

**బాల శశాంక మౌళికిఁగ పాలికి మన్మథ గర్వ పర్వతో**

**న్మూలికి నారదాది మునిముఖ్య మనస్సరసీరుహాలికిన్.** [1-2]

ఇదేంటి శివుడిమీద పద్యం అనిపిస్తోందా? అవును శివుడిమీదే. ఎందుకంటే పోతన శివభక్తుడు. వీరభద్ర విజయం కూడా పోతనే రాసాడు. ఓ రోజు నదీతీరాన స్నానంచేసి ధ్యానంలో కూర్చోగానే ఒకాయన కనిపించి 'నువ్వు భాగవతం తెలుగులో రాయి, నీకు భవబంధాలు తెగుతాయి. నేను రామభద్రుణ్ణి.' అని చెప్పి పోతన ఏదో అడిగేలోపుల మాయం అయిపోయేడుట. ఇది పోతన మొదట్లోనే చెప్పుకున్నాడు. సరే ఇప్పటికి పోతన రెండు ప్రార్థనలు చేసాడండీ, మొదట రాముడికీ, తర్వాత తన ఇష్టదైవానికీ. ఆ తర్వాత మొదలుపెడుతున్నాడు చూడండి.

ఉ. **ఆదర మొప్ప మ్రొక్కిడుదు నద్రి సుతా హృదయానురాగ సం**

**పాదికి దోషభేదికిఁ బ్రపన్నవినోదికి విఘ్నవల్లికా**

**చ్ఛేదికి మంజువాదికి నశేష జగజ్జన నంద వేదికిన్**

**మోదకఖాదికిన్ సమద మూషక సాదికి సుప్రసాదికిన్.** [1-5]

మొదట విఘ్నవినాయకుడికి ప్రార్థన చేయలేదూ అనిపిస్తోందా? అదే విచిత్రం. వినాయకుడు చెప్పలేదు పోతనకి భాగవతం రాయమని. రాముడు చెప్పేడు. అందుచేతే రాముడికే ముందు. అదీగాక ఏ స్కంధం మొదలు పెట్టేముందైనా రాముడికో పద్యం రాసి మొదలుపెట్టాడు పోతన.

ఇప్పుడు రాయడానిక్కావాల్సిన పటిమకోసం సరస్వతీదేవిని అడుగుతున్నాడు చూడండి. పోతన వినయం చూస్తే కళ్ళనీరు కారుతుంది చదివే వాళ్ళకి. ఇదే వినయం చివరిదాకా ఉంది కనకే పోతన అంతటి మహాకావ్యం రాయగలిగేడు. నేను ఎంత గొప్పగా రాస్తున్నానో అని ఎప్పుడూ అనుకోలేదు.

శా. **పుట్టం బుట్ట, శరంబునన్ మొలవ నంభోయానపాత్రంబునన్**

**నెట్టం గల్గను గాళిఁ గొల్వను బురాణింపన్ దొరంకొంటి మీఁ**

**దెట్టే వెంటఁ జరింతుఁ దత్సరణి నా కీవమ్మ యో! యమ్మ మేల్**

**పట్టున్ నాకగుమమ్మ నమ్మితిఁ జుమీ బ్రాహ్మీ! దయాంభోనిధీ!** [1-7]

అమ్మా నేను (తపస్సు చేసాక) పుట్టలో, రెల్లుపొదలో పుట్టలేదు వాల్మీకిని అవడానికి. పడవలో పుట్టిన వ్యాసుణ్ణికాదు. కాళిని ప్రసన్నం చేసుకున్న కాళిదాసునీ కాదు. అయినా సరే ఈ పురాణం రచనకి పూనుకున్నాను. నువ్వు ఎలా చేయమంటే అలా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు దమ్ముగా ఉండు. దయాంభోనిధీ, నిన్నే నమ్ముకుని ఉన్నాను.

హృషీకేష్ లో దివ్య జీవన సంస్థాపకులు శివానంద గారు చెప్తున్నారు చూడండి. Humility draws in Divine Grace. Faith draws in Divine Grace. Surrender draws in Divine Grace. Prayer draws in Divine Grace. Develop faith, practice humility, pray regularly and surrender unconditionally unto His will. సరిగ్గా ఇదే పోతన ఆచరించినట్టు కనిపిస్తుంది. ఇంకోలా ఆలోచిస్తే పోతన అయినా, శివానందులైనా, రామకృష్ణ పరమహంస అయినా వీళ్ళందరూ ఆచరించింది ఒకటే అనిపిస్తుంది. అదే పూర్తి శరణాగతి. ఒక్కసారి ఆ శరణాగతి అలవడగానే భగవత్కృప ఏమీ ఆటంకాలు లేకుండా ప్రవహిస్తుంది. భగవద్గీతలో "విద్యా వినయస్సంపన్నే .." గుర్తుకొస్తోందా?

నేను సహజ కవినే అంచేత నేను రాసేయగలను అని ఒక్కసారి కూడా అనుకోలేదు పోతన అనిపిస్తుంది తర్వాత దుర్గాదేవి మీద పద్యం చూస్తే.

**ఉ.  అమ్మలఁ గన్నయమ్మ, ముగురమ్మలమూలపుటమ్మ, చాలఁ బె**
**ద్దమ్మ, సురారులమ్మ కడు పాఱడి పుచ్చిన యమ్మ, తన్ను లో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మా**
**యమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్.** [1-10]

నాకు మంచి కవిత్వంలో పటుత్వ సంపదలు ఇమ్మని అడుగుతున్నాడు ఎవర్నీ? అమ్మలగన్నయమ్మ - సప్త మాతృకలకీ అమ్మట ఆవిడ. ముగ్గురమ్మల మూలపుటమ్మ - అంటే లక్ష్మీ సరస్వతి, పార్వతులకీ కారణమైన అమ్మట.

కవిత్వం రాసేటప్పుడు ఏ లెవెల్లో ఉన్నా ఒక్కోసారి చెత్త ఆలోచనలు రావొచ్చు. అవి దరిద్రానికి హేతువులౌతాయ్. ఒకసారి అవి బుర్రలో చొరబడితే బుర్రంతా పాడై ఇంక ముందుకి జరగదు రచన. ఈ దరిద్రం రావడానికి అనేకానేక కారణాలు ఉండొచ్చు. ఆ దరిద్రాలు తనకి అంటుకోకుండా ఉండాలంటే ఎంతో స్థైర్యం అవరసరం. పోతన అలాంటి దరిద్రాలు మనసులోకి రాకుండా ఉండడానికి లక్ష్మీ దేవిని స్తుతిస్తున్నాడు ఇప్పుడు.

**మ.  హరికిం బట్టపుదేవి, పున్నెముల ప్రో వర్థంపుఁ బెన్నిక్క, చం**
**దురు తోఁబుట్టువు, భారతీ గిరిసుతల్ తో నాడు పూఁబోఁడి, తా**
**మరలం దుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించు నిల్లాలు, భా**
**సురతన్ లేములు వాపు తల్లి, సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్** [1-11]

నాకు డబ్బులు కావాలి అని అడగలేదు చూసారా? ఎందుకూ? ఎందుకంటే భాగవతం రాసేది డబ్బుల కోసం కాదు. పేరు ప్రఖ్యాతుల కోసమూ కాదు. ఎంతమందికి ఉపయోగపడుతుందో అనుకోనూ లేదు. అదే పూర్ణ శరణాగతి అంటే. ఏమిటి ఎందుకూ అని

అడగడం కాదు. రామభద్రుడు రాయమన్నాడు, అంతే. పీరియడ్. అడిగింది తన ప్రకాశంతో లేములు (దరిద్రాలు) వాపే తల్లి 'యిచ్చున్ నిత్య కళ్యాణముల్ అని మాత్రమే. ఇది నా ఉద్దేశ్యంలో మంచి శుభప్రదమైన ఆలోచనలు రావడానికి అని మాత్రమే.

ఈ ప్రార్ధనలన్నీ అయ్యాక ఇప్పుడు అసలైన హీరోని రంగంలోకి దింపుతున్నాడు. కింద రెండు పద్యాలూ షష్ట్యంతాల లోనివి. ఇందులో చిన్నప్పుడే కృష్ణుడు చంపిన తృణావర్తుడూ, పూతన లాంటి రాక్షసుల గురించి ఉంది.

**ఉ. హారికి, నందగోకులవిహారికిఁ జక్రసమీరదైత్య సం**
**హారికి, భక్తదుఃఖపరిహారికి, గోపనితంబినీ మనో**
**హారికి, దుష్టసంపదపహారికి, ఘోషకుటీపయోఘృతా**
**హారికి, బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్. [1-29]**

**ఉ. న్యాయికి, భూసురేంద్రమృతనందనదాయికి, రుక్మిణీమన**
**స్థ్సాయికి, భూతసమ్మదవిధాయికి, సాధుజనానురాగ సం**
**ధాయికిఁ బీతవస్త్రపరిధాయికిఁ బద్మభవాండభాండ ని**
**ర్మాయికి, గోపికానివహ మందిరయాయికి, శేషశాయికిన్ [1-32]**

సాధుజనానురాగ సంధాయికిఁ బీతవస్త్రపరిధాయికి అంటే మంచివారికి/సాధుజనులకి అనురాగం కూర్చేవాడూ, పచ్చని పట్టుబట్టలు వేసుకున్నవాడూ అయిన కృష్ణుణ్ణి తల్చుకుంటున్నాడు.

ఇది పోతన చేసిన మొదటి ప్రార్ధన. పోతన మొత్తం భాగవతం అంతా, ఎంత గొప్పగా మొదలుపెట్టాడో అదే లెవెల్లో కంటిన్యూ చేసాడు. ఒక్కొక్క చోట పోతన రాసిన వచనం చదువుతూంటే ఏమిటిది తెలుగేనా అనిపించడం కద్దు. ముగించే ముందు నండూరి కృష్ణమాచార్య గారు పోతన గురించి భాగవతం ముందుమాటలో ఏం రాసారో ఒకసారి చూద్దాం.

".... అది ఇంద్రజాల మహేంద్రజాలాలను మించి కవితాకళ ప్రయోగించగల భువన సమ్మోహనాస్త్రం. పోతన అక్షయ సమ్మోహనాస్త్ర తూణీరుడు. సత్ప్రవర్తన, సాహితీ ప్రతిభ జీవితంలో గంగా యమునల వలె సంగమించుటచేత పోతన ఆంధ్ర వాఙ్మయాకాశంపై ధృవతారగా వెలుగొందుచున్నాడు. పోతన పద్యాలు రసగుళికలు."

<u>చివరి తోక</u>: మొదట్లోనే చెప్పినట్టు ఇందులో తప్పులేవేనా ఉంటే అవన్నీ నావే. నేను తెలుగు పండిట్ ని కాదని ముందే చెప్పాను. భాగవతం అన్ని పద్యాలూ రాయడంలేదు ఇక్కడ; నాకు బా...గా నచ్చినవి మాత్రమే రాసాను. అంటే మిగతావి నచ్చలేదని కాదు. ఇవి కొంచెం బాగా నచ్చాయి.

ఓ సారి మళ్ళీ పద్యాలన్నీ చదివితే ఈ సారి ప్రతీ పద్యంలోని నాలుగు లైనుల్లో రెండో అక్షరం ఎలా ఉందో గమనించండి. అవన్నీ ఒకే అక్షరమేనా?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS